క్లుప్తంగా

కేంద్రియ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తెనాలి జగ్గడిగుంటపాలెంలోని కేంద్రియ విద్యాలయంలో బాలివాటిక-3, ఒకటో తరగతి ప్రవేశాలకు కేంద్రియ విద్యాలయ సంఘటన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 15 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి కూడా ఏప్రిల్ 1 నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన తరువాత నుంచి 10 రోజుల లోపు 11వ తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 19న ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. వివరాలకు కేంద్రియ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సేవలతో రోగులకు చేరువ కండి

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



తెనాలి అర్బన్: వైద్యులు నిస్వార్థంగా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ నిర్వాహకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని వహాబ్‌రోడ్డులోని శారద సర్వీస్ సొసైటీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శారద సర్వీస్ సొసైటీని స్థాపించి అనేక మందికి ఉచితంగా ఎన్నో రకాల వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శారద సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం డాక్టర్ శారదను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవిరెడ్డి శ్రీనివాసరావు,నల్లూరు శ్రీనివాస్,పాల్గొన్నారు.

వాస్తవిక సమాజానికి నిలువుటద్దం 'గోపాత్రుడు'



తెనాలి: వాస్తవాలతో కాకుండా ఉద్వేగాలు, విశ్వాసాల ఆధారంగా సత్యాన్ని నిర్ధారిస్తున్న 'పోస్ట్ ట్రూత్'ను 'గోపాత్రుడు' నవలలో అధిక్షేపణ ప్రక్రియతో కేఎవై పతంజలి శక్తివంతంగా వివరించినట్టు ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య అన్నారు. ఆహ్వానం లక్ష్మీ సంస్మరణలో స్థానిక సాహితీ, సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో కేఎస్‌వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చావేదికను నిర్వహించారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. లక్ష్మీనరసయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పోస్ట్ ట్రూత్ భావనను గోపాత్రుడు నవలలో ఎలా వర్ణించిందీ, ఆ నవలలోని ఘటనలు, సంభాషణలతో వివరించారు. ముఖ్యంగా నవలలో సత్యం అనేది వివిధ సమూహాల ప్రయోజనాల కనుగుణంగా ఎలా వండబడుతుందీ చెప్పటం జరిగిందన్నారు. కులాలు, మతాలు, భావజాలాలు, రాజకీయ పార్టీలు ఇలాంటి సమూహాలుగా చీలిపోయిన సమాజంలో ఎవరి సత్యం వారిదేగాని అందరికీ చెందిన సత్యం గ్రహణం బారిందన్న వాస్తవాన్ని పతంజలి చక్కగా వివరించినట్టు తెలిపారు. సత్యం అనేది సమాజగతంగా కాకుండా సంస్థాగతంగా, సమూహగతంగా, వ్యక్తిగతంగా లాభనష్టాల కనుగుణంగా మారిన తీరుతెన్నులను నవలలో చూడొచ్చని చెప్పారు. సమాజం నైతికంగా, అధ్యాత్మికంగా పతనమైన దానికి నిదర్శనంగా ఈ నవలను చూడాలనీ, గోపాత్రుడు నవల నేటి రాజకీయాల్లోనూ, వివిధ సమూహాల ఘర్షణల్లోనూ ఎలా బతికివుందో మనం చూడొచ్చని 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్ తన ప్రసంగంలో చెప్పారు. జుగాష్‌విలి పర్యవేక్షించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తెనాలిటౌన్: నాజర్‌పేటలోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం రంజాన్ మాసం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న యోగా సభ్యులు యడ్ల వెంకటకృష్ణ, మంజూష దంపతుల పిల్లలు విశ్వజ్ఞ శ్రీ సత్య, విధాన్స్ శ్రీ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీయోగ కన్వీనర్ రమణయ్య మాట్లాడుతూ యోగా సభ్యులు పుట్టిన రోజు, పెళ్లిరోజు వేడుకలు విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు.

సంక్షేమంలో దేశానికే దిక్సూచి సీఎం జగన్ పాలన

- పరిపాలనలో పెనుమార్పులు
- ఎన్నికల వేళ దిగుమతి అభ్యర్థులు షోలు చేస్తున్నారు
- ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, వేదికపై ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

తెనాలి: కులమతాలు, పార్టీల వివక్ష లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి దిక్సూచిలా నిలిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమాన్ని అందిస్తూ, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతోపాటు పరిపాలనలో పెనుమార్పులు తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. 14 ఏళ్లలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఇంటింటికి సంక్షేమాన్ని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పేదలపై ఆయనకు ప్రేమ లేకపోవటమే అందుకు కారణమన్నారు. కొల్లిపరలోని గుదిబండి వారి కల్యాణమండపలో శనివారం మధ్యాహ్నం మండలంలోని ముఖ్యనేతలు, కార్యకర్తలతో జరిగిన పరిచయ సభకు పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ అభ్యర్థి కిలారి మాట్లాడుతూ ఆర్‌బీకే పేరుతో రైతు కోసం ఒక కార్యాలయం ఏపీ మినహా ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ-క్రాప్ నమోదుతో రైతులకు కలుగుతున్న లాభాలెన్ని? ఏ సీజనులో జరిగిన పంట నష్టానికి అదే సీజనులో నష్టపరిహారం ఎప్పుడైనా ఇచ్చారా? అనేది రైతులు ఆలోచన చేయాలన్నారు. తుపాన్ల సమయంలో పంట పొలాలకు ఇబ్బందుల్లేకుండా డ్రైనేజిలు, పంట కాల్వల మెరుగుదలకు తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. గతంలో రెండుసార్లు ఎంపీగా గెలిచిన వ్యక్తి ప్రజలకు కనిపించింది లేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్నారై, గల్లా జయదేవ్‌ను మరిపిస్తానని చెబుతున్నారని ఆయనలాగే ఈయనా కనిపించనని పరోక్షంగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎంపీ కారణంగా పదేళ్లలో పార్లమెంటు నియోజకవర్గం వెనుకబడిందని కిలారి రోశయ్య చెప్పారు. కొత్తగా వచ్చిన ఎన్నారై కూడా అమెరికాలో ఉంటారు మినహా ప్రజలకు అందుబాటులో ఉండరని అన్నారు. పొన్నూరులో తనకు ముందు 35 ఏళ్లలో జరగని అభివృద్ధిని అయిదేళ్లలో తాను చేసి చూపించానని రోశయ్య చెప్పారు. స్థానికంగా ఉంటూ అనుభవం కలిగిన తాను పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు. తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న నాదెండ్ల మనోహర్ ఎన్నికల ముందు నియోజకవర్గానికి వచ్చినట్టు గుర్తుచేశారు. అయిదేళ్లూ అడ్రస్ లేకుండా ఉంటూ, ఇప్పుడొచ్చి రోడ్లు బాగోలేవని విమర్శిస్తున్నారని అన్నారు. తన హయాంలో 160 రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖకు నిధులు రానందున వీఎస్సార్ కాలేజి-విజయవాడ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. గుంటూరు ఎంపీగా గెలిచిన గల్లా జయదేవ్ ఎంపీ ల్యాడ్స్ నిధులను ఇప్పించొచ్చు కదా? ఆయన్ను ఎందుకు ప్రశ్నించరని ఎమ్మెల్యే అన్నారు. ఆయన స్థానంలో పోటీచేస్తున్న ఎంపీ అభ్యర్థికి, ప్రజలు, కులమతాలను గౌరవించాలనే సంస్కారం లేదన్నారు. ఉన్నత చదువులు చదివి డబ్బులు సంపాదించాననే అహంతో సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఆ మాటలను చూస్తే ఆయనకు ప్రజలపైనా, సమాజంపైనా ఎలాంటి అవగాహన ఉందో అర్థం అవుతుందన్నారు. అయిదేళ్లు కనిపించకుండా ఎన్నికల ముందు ఇళ్లకొచ్చి ఓటు అడగకుండా రోడ్‌షోలతో కాలక్షేపం చేస్తున్నారని ఎంపీ, ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులనుద్దేశించి వ్యాఖ్యానించారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ వచ్చేందుకు ఎంపీగా కిలారి రోశయ్యను, ఎమ్మెల్యేగా తననూ ఆశీర్వదించాలని మంచి మెజారిటీతో గెలిపించాలని శివకుమార్ విజ్ఞప్తిచేశారు. మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అవుతు శేఖర్‌రెడ్డి మాట్లాడారు. కొల్లిపర మండలానికి చెందిన పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీల చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు తీసుకోండి



చైర్‌పర్సన్ రాధిక



టీడీపీ కౌన్సిలర్ అరుణను వారిస్తున్న సహచర కౌన్సిలర్‌లు

- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌ల వినతి
- ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు పట్టణం విస్తరిస్తున్న స్థాయిలో కార్మికులు లేకపోవటం వల్ల దోమల బెడద ఎక్కువైంది. పగటి సమయంలో కూడా దోమలు కుడుతున్నాయని, వాటి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, మొఘల్ అహ్మద్ బేగ్, షేక్ దుబాయ్‌బాబులు కోరారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో మొదటి అంశం చదవటం పూర్తికాగానే జీవో నెంబర్ 279 అమలులో ఉందా? లేదా అనేది తెలియజేయాలని కౌన్సిలర్ రామయ్య కోరారు. జీవో అమలులో లేదని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కార్మికులు తగిన సంఖ్యలో లేకపోవటం వల్ల వార్డుల్లో నిర్వహణ పనులు నిలిచిపోతున్నాయని రామయ్య తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మరో కౌన్సిలర్ మొఘల్ అహ్మద్‌బేగ్, షేక్ దుబాయ్ బాబులు లేచి వార్డులో దోమల సమస్య ఎక్కువగా ఉందని, స్ప్రెయింగ్, ఫాగింగ్ ప్రతిరోజు చేయాలని కోరారు. దోమల నియంత్రణలో భాగంగా ఫాగింగ్, స్ప్రెయింగ్ వంటి వాటిని చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని కమిషనర్ తెలిపారు. తన వార్డులో పంట కాల్వకు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు చెప్పిన పనులు జరగటం లేదని 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో తాను వార్డుల్లో పర్యటించలేకపోతున్నానని కార్మికులను వార్డుకు పంపుతామని వారితో పనులు చేయించుకోవాలని చైర్‌పర్సన్ రాధిక సూచించారు. దీనికి శాంతించని అరుణ గతంలో ఇలానే చెప్పారంటూ వాదనకు దిగారు. చివరకు కమిషనర్ శేషన్న కలుగజేసుకుని ఆదివారం మీ వార్డుకు వస్తానని, సమస్యలు నా దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శాంతించని ఆమె వాదనకు దిగటంతో టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు సర్దిచెప్పారు. అనంతరం అజెండాలోని అంశాలు చదవటం పూర్తికాగానే ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ కోసం అదనంగా 40 మంది కార్మికులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వారితో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ పి అనూషా, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ నిర్ణయంపై హర్షం

తాడేపల్లిరూరల్: రానున్న రాజ్యసభ ఎన్నికల్లో ముస్లింలను రాజ్యసభకు పంపుతానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శనివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను రాజ్యసభకు పంపుతాననడం ముస్లింల సంక్షేమంపై చిత్తశుద్ధి మరోసారి రుజువైందన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ శివకుమార్

తెనాలి అర్బన్: క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లకు ఏఎస్ఎన్ విద్యా సంస్థలు రాష్ట్రంలోనే పేరు గాంచాయని తమ విద్యా సంస్థల్లో చదివిన ప్రతి విద్యార్థి చదువు పూర్తయ్యే లోపు ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని అన్నాబత్తుని సత్యనారాయణ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించిన 32 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ ఫైనాన్స్ సంస్థ పిరమాల్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించిందని చెప్పారు. దీనిలో 32 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరికి నెలకు రూ.21 వేల వేతనం లభిస్తుందన్నారు. అలాగే బీకాం చివరి సంవత్సరం చదువుతున్న దినేష్ సత్యసాయి ఐటీసీ కంపెనీలో అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని సాధించినట్లు చెప్పారు. రూ.4.4 లక్షల వార్షిక వేతనం అతనికి లభిస్తుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కొనసాగుతున్న నేపథ్యంలో తమ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను తమ కళాశాలలో అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



36వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప అన్నారు. పట్టణంలోని 36వ వార్డు ఎంఎం జ్యూవెలరీ దగ్గర నుంచి శనివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి, 36వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పోతిరెడ్డి హేమలత, ఏలూరి శేషగిరిరావు, కఠారి హరీష్, యలవర్తి సాంబశివరావు, గోల్డ్ రహిమా, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, చుండూరు సాయి, మల్లిబోయిన రాము, బట్టా అంజిబాబు, జంగయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, నీలి అజయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోర్టు వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టు

E.P. No. 43/2021 in O.S. No.373/2015

బిట్వీన్:
జట్టు శివకుమార్ -DHR
మరియు
షేక్ సల్మాన్ బి మరియు మరొకరు -JDR

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా గౌరవ కోర్టు వారి ఆదేశముల ప్రకారము దిగువ షెడ్యూలు ఆస్తిని ది.15.4.2024న గౌరవ కోర్టు వారిచే బహిరంగ వేలము జరుపబడును. ఆసక్తి కలవారు ది.15.04.2024న ఉ.10.30 గం.లకు గౌరవ కోర్టు ఆవరణలో జరుగు వేలము పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి. కొల్లూరు సబ్.డి. యిలాకా వేమూరు మండలము, వేమూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరినటువంటి వేమూరు గ్రామము తాలూకు డి.నెం. 134 బి-2, య. 0.12 సెంట్లలో డోరు నెం.6-4/10 గా గల య.0.02 సెంట్లులో పూరింటితో సహా హద్దులు. తూర్పు: షేక్ బేగం గారి స్థలం, దక్షిణము: షేక్ సుభాని గారి స్థలం, పడమర: షేక్ హుస్సేన్ గారి స్థలం, ఉత్తరం: రైల్వేవారి స్థలం.
ఈ హద్దుల మధ్య గల యే.0.02 సెంట్లు అనగా చ.గ. 96.8లు లేక చ.మీ. 80.92 ఛ మరియు అందులోని పూరిపాక

డి.హెచ్‌ఆర్ వాల్యు మొత్తం: రూ.5,00,000-00
అమీనా వాల్యు మొత్తం: రూ.13,00,000-00,
జెడిఆర్ వాల్యు మొత్తం: దాఖలు చేయలేదు
మార్కెట్ వాల్యు మొత్తం: రూ. 1,80,560-00
శ్రీకోర్టువారిఉత్తర్వులలో వేలంతేది: 15-04-2024
తదుపరి విచారణ: 22-04-2024

నన్నపనేని మాధవరావు
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాది, తెనాలి,
గుంటూరు జిల్లా. సెల్: 9493244873

భారతీయ సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

వివేకానంద సెంట్రల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో విద్యావేత్త డాక్టర్ ఏ.ఆంజనేయులు



గ్రాడ్యుయేషన్ డేలో సర్టిఫికెట్లు స్వీకరించిన చిన్నారులు

తెనాలి: భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఏ.ఆంజనేయులు అభిప్రాయపడ్డారు. భారతీయ సంస్కృతిని పాశ్చాత్య దేశాల శాస్త్ర సాంకేతికతతో మేళవించి విద్యార్థులు కృషి చేసినట్టయితే అద్భుత విజయాలు సాధించగలరని పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ వివేకానంద సెంట్రల్ ఆవరణలోని ఏవీఎస్ ఆడిటోరియంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను వైభవంగా నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాన్వొకేషన్ తరహాలో విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక దుస్తులు ధరింపజేసి ఒక్కో తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి ఆహ్వానించి అతిథులచే సర్టిఫికెట్లు, క్రీడల్లో విజేతలకు పతకాలను అందజేశారు. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ సర్జన్, రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జీవనలత, ప్రముఖ దంత వైద్యుడు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ డి.రవీంద్రనాథ్, వివేక విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు విద్యార్థులకు సందేశాలనిచ్చారు. సాయంత్రం వరకు జరిగిన వేడుకలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివేకానంద సెంట్రల్ స్కూల్ సీఈవో రావిపాటి వెంకట్రామ్, ప్రిన్సిపాల్ రమాదేవి, శివకుమార్, జీవీ చౌదరి, మురళి, రాజేష్, అక్షయ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన పెంచుకోండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



ర్యాలీలో కమిషనర్ శేషన్న, సీఐ దశరథ రామారావు

తెనాలి అర్బన్: ఓటు ఆవశ్యకతను అంతా తెలుసుకొని రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఎవేర్నెస్ గ్రూప్ సభ్యులు పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అంతా ఓట్లు వేయాలని సూచించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అంగన్‌వాడీలతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, వన్‌టౌన్ సీఐ జి.దశరథ రామారావు, సీడీపీవో ఎం.సునీత, ఏసీపీ సధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

కొల్లిపర: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు తన ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఓటుహక్కు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు ఉపయోగించుకొనే విధంగా గ్రామ స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి ప్రజలను ఎన్నికల్లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేందుకు అనువైన ప్రణాళికలను రూపొందించి అమలు పరిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, మండల పరిషత్ ఏవో చంద్రమోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచండి

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచే విధంగా అందరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని డాక్టర్ రావి రవీంద్రనాథ్ కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తెనాలి పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన నీటిని ప్రతిరోజు పరీక్షించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకూండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ఫార్మసీ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేత

తెనాలిఅర్బన్: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలను ఐఎస్ఓ ప్రతినిధులు శనివారం తనిఖీ చేశారు. ఐఎస్ఓ సర్టిఫికెట్ రెన్యువల్ చేసే కార్యక్రమంలో భాగంగా కళాశాలకు వచ్చిన వారు పరీక్ష ఫలితాలు, లైబ్రరీ, లెబొరేటరీ, డిజిటల్ తరగతి గదులు వంటి వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణకు ఐఎస్ఓ ప్రతినిధులు కె.కుటుంబరావు, ఎ.సింగయ్యలు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐఎస్ఓ టీమ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, సభ్యులు కె.కళ్యాణ్ చక్రవర్తి, సిహెచ్.నాగశైలజ, టి.లక్ష్మీ దుర్గా, ఎ.సోనీ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

సబ్‌కలెక్టర్, తెనాలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్, తెనాలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులైన ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద సమకూర్చాల్సిన ప్రత్యేక సదుపాయాలపై ప్రతినిధులతో చర్చించారు. ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం, దివ్యాంగ ఓటర్ల ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చలు జరిపారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఇతర సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తెనాలి తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖాధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘ ప్రతినిధులు గుంటుపల్లి ఉదయ్‌కిరణ్, బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.